బ్లాక్ మెయిల్

వాణిశ్రీ

సుధారాణి డ్రైవ్ చేస్తున్న ప్రీమియర్ పద్మిని కారు రోడ్డుమీద విమానంలా దూసుకుపోతోంది.

టైమ్ ఆరున్నర దాటినా ఇంకా చీకటి పడలేదు. ఎండాకాలం పగటిపొద్దు ఎక్కువ.

కొండలచాటున పశ్చిమాకాశం సంధ్యకాంతులతో మెరిసిపోతోంది సుధారాణిలాగే.

ఆమె ప్రతిరోజూ ఫ్యాక్టరీనుంచి తిరిగివచ్చే వేళ ఇంచుమించుగా అదే.

రోజూ ఒకేలా గడవదు. రోజులన్నీ మనవి కాదన్నట్లు ఆ రోజు ఆమె జీవితంలో ముఖ్యమైన మలుపు తీసుకు రానున్నట్లు ఆమెకు తెలియదు.

అమితమైన వేగంతో కారు నడిపిస్తున్న సుధారాణికి రోడ్డుమీద అడ్డంగా ఏదో పెట్టినట్లు కనిపించి స్లో చేసింది. తీరా చూస్తే అవి పచ్చిగడ్డిమోపులు.

'రోడ్డుకు అడ్డంగా పడేశారే ఎవరో!' అని విసు

క్కుంటూ కారు ఆపింది, హారన్ నొక్కుతూ.

అంతలో ఎవరో ఒక వ్యక్తి అవతలి డోర్ తీసుకుని ఫ్రంట్ సీటులోకి వచ్చేసి తళతళ మెరుస్తున్న కత్తి చూపిస్తూ ఆమెను డ్రైవింగ్ సీటులోనుంచి ప్రక్కకు లాగి పడేశాడు.

కారు స్పీడుగా వెనక్కి తిప్పేశాడు. ఆమె భయ విహ్వాలురాలై నోటమాటరాక బొమ్మలా వుండిపోయింది. నెత్తిన టోపీ, పెద్ద పెద్ద మీసాలు, పొడుగాటి గడ్డం ఎవరో ఆ భయంకర వ్యక్తి ఎడమచేత్తో కత్తిపట్టుకుని కుడిచేత్తో స్టీరింగ్ పట్టుకుని కారు నడిపిస్తున్నాడు.

"ఎవరు నువ్వు?" అని గట్టిగా అరిచింది సుధారాణి.

అతను సమాధానం చెప్పకుండా "ష్...." అన్నాడు కళ్ళెర్రజేస్తూ.

కారు కొండల మధ్యకు వెళ్ళిపోయింది. రోడ్డు దిగి, కాసేపటికి ఒక పొదలోకి దూసుకెళ్ళింది కారు. అతను డోరు తీసి "దిగు" అన్నాడు.

"ఎవరు నువ్వు? నన్నెందుకు తీసుకొచ్చావ్ చెప్పు?" అంది ఆమె కోపం తెచ్చుకుంటూ.

అతను పకపక నవ్వి, ఆమె భుజంమీద చెయ్యివేసి, "ఎందుకో చెప్తాలే. ముందు దిగు" అన్నాడు.

"దిగను" అంది సుధారాణి బింకంగా. అతని చేతిని విసిరికొట్టింది.

"అనవసరంగా నాకు కోపం తెప్పించకు. మర్యాదగా చెప్పినట్లు విను. లేకపోతే ఈ కత్తి నీ ప్రాణాలు తీస్తుంది" అన్నాడు కరకు కంఠంతో.

"ప్రాణంపోయినా ఫరవాలేదు. మనిషన్న తర్వాత ఎప్పుడైనా చచ్చేదే" అంది ఆమె నిబ్బరం ప్రదర్శిస్తూ.

"చావడానికి తొందరపడకు. ఇంకా పెళ్ళయినా కాలేదు. అప్పుడే వేదాంతం చెప్తున్నావు" అని అతను నవ్వి "ఈ దేశంలో వాళ్ళకి పుట్టగానే వంట బట్టేది వేదాంతమే. నీ మెట్ట వేదాంతం చాలించి దిగు" అన్నాడు.

"నేను దిగను."

"సుధారాణీ! మొండితనానికి పోయి ప్రాణానికి ముప్పు తెచ్చుకోకు."

"నాకు ప్రాణమంటే లెక్కలేదు" అంది ఆమె.

"నీకు లేకపోయినా నీ ప్రాణానికి చాలా విలువ వుంది. నా చేతికి డబ్బు వచ్చేదాకా నీ ప్రాణాలు సురక్షితంగా వుండడం నాకు అవసరం" అన్నాడు.

"నీ చేతికి డబ్బు ఎలా వస్తుంది?"

"నా చేతిలో నీ ప్రాణం వున్నందుకు."

"యూ! రాస్కెల్....నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యాలనుకుంటున్నావా?" గట్టిగా అరిచింది సుధారాణి.

"నిన్ను కాదు మీ అమ్మను....అదంతా తర్వాత నీకే అర్థమౌతుందిలే....దిగు....దిగు...." అని ఆమెను బలవంతంగా పట్టుకుని కారు దించాడు అతను.

ఆమె గింజుకుంటూ క్రిందకు దిగి పారిపోవడానికి పరిగెత్తింది. అతను ఆమెను ఒడిసిపట్టుకుని "నా చేతుల్లో చిక్కాక పారిపోవడం అంత సులభం కాదు" అన్నాడు.

"ఇప్పుడు నన్నెక్కడికి తీసుకెళ్తావ్?" బాధగా అంది ఆమె అతని చేతుల్లోంచి తప్పించుకోడానికి గింజుకుంటూ.

"భయపడకు. నీమీద మోజుపడి నిన్ను తీసుకెళ్ళడం

లేదు. నాకు కావలసింది డబ్బు. నిన్ను అడ్డం పెట్టుకుని మీ అమ్మ దగ్గర్నుంచి లాగుతాను డబ్బు. డబ్బుంటే పదహారేళ్ళ పడుచు నవ్వుతూ పక్కలోకి వస్తుంది. నీకు పాతికేళ్ళు దాటిపోయాయి. వృద్ధ కన్యవు. నువ్వెవడికి కావాలి. పెళ్ళయితే నలుగుర్ని కని ముసలమ్మవై పోయే దానివి" అతను నవ్వాడు గట్టిగా.

"నీ పిచ్చివాగుడు కట్టిపెట్టు" కోపంతో బుసలు కొట్టింది సుధారాణి.

"నీ కోపం కట్టిపెట్టు ముందు. ఇది నీ స్వంత ఫ్యాక్టరీ కాదని గుర్తుంచుకో. ఎగిరిపడితే క్రిందపడతావు" అంటూ ఆమెను బలవంతంగా కొండపైకి ఎక్కించాడు అతను.

ఆ కొండపైన పాడుబడిన గుడి ఒకటి వుంది. దానికి తలుపులూ లేవు, లోపల దేవుడూ లేడు. విశాలమైన మండపం కట్టివుంది. పూర్వం ఎప్పుడో పూజా పునస్కారాలు జరిగి వుండొచ్చు.

అతను సుధారాణి పెడరెక్కలు విరిచికట్టి ఒక స్తంభానికి ఆనించి త్రాడుతో బంధించాడు. ఆమె అతన్ని నానా దుర్భాషలూ ఆడుతోంది.

"నువ్వు గనుక నోర్మూసుకోకపోతే నీ నోట్లో గుడ్డలు కుక్కుతాను" అని గద్దించాడు అతను.

సుధారాణి నీరసంగా కళ్ళు మూసుకుని బాధగా మూలిగింది. ఆమెకు ఏడుపు ముంచుకొచ్చింది. వీడెవడు? డబ్బుకోసం తననే ఎందుకు చెరబట్టాడు? వీడేదైనా తనపై అత్యాచారం జరపడుగదా!

ఆమెకు భయంతో గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

2

టెలిఫోన్ గణగణ మ్రోగింది.

సావిత్రి రిసీవర్ ఎత్తి "హల్లో...." అంది.

"సావిత్రిగారేనా?"

"అవును."

"నమస్కారం సావిత్రిగారూ!"

"నమస్కారం. ఎవరు మీరు?"

"బైరాగి."

"బైరాగా?"

"అవునండీ నేను బైరాగినే."

"ఎవరు మీరు? మీ పేరు ఎప్పుడూ వినలేదు. గుర్తుపట్టలేక పోతున్నాను" అంది సావిత్రి.

"వివరాలు తర్వాత మాట్లాడుకుందాంగాని, ముందు మీరు నాకొక సహాయం చెయ్యాలి."

"చెప్పండి."

"నాకు అర్జంటుగా ఏభైవేలు కావాలి."

"ఏయ్!....ఎవరు నువ్వు?...."

"నేనేనండీ బైరాగిని."

"బైరాగివో సన్యాసివో....నీ కేదైనా పిచ్చిగాని పట్టలేదు గదా! వూరికే ఏభైవేలు ఎవరిస్తారు? ఫోన్ చేసి మరీ అడుగుతున్నావే!"

"వూరికే ఇవ్వనవసరం లేదండీ. మీరు ఏభైవేలు ఇస్తే మీ ముద్దుల పెద్దల కూతుర్ని మీకు తిరిగి ఇచ్చేస్తాను.... లేదా! ఆమె ప్రాణాలు తీసుకుంటాను."

సావిత్రి గుండె ఆగిపోయినట్లయింది.

"మా సుధనా! ఎక్కడుంది ఇప్పుడు?" ఆతృతగా ప్రశ్నించింది.

"నా దగ్గరే వుంది. ఆమెను ఎత్తుకొచ్చాను."

"బైరాగీ!...."

"యస్. మేడమ్."

"ఇప్పుడు టైమ్ ఎనిమిదయింది. ఇంత రాత్రిపూట అంత డబ్బు ఎక్కడ తెమ్మంటావ్?"

ఫోన్‌లో నవ్వు వినిపించింది.

"ఎందుకయ్యా! నవ్వుతావు?"

"నాకు ఆ మాత్రం తెలియదా సావిత్రిగారూ! ఇప్పుడు బ్యాంకులు మూసివుంటాయి కాబట్టి డబ్బులేదు అంటారు. అవునా!"

"ఆఁ.... అవును."

"నాకు డబ్బే కావాలని పట్టుదలలేదు. ఆ మాత్రం బంగారం ఇచ్చినా చాలు. అన్నట్లు మీకు చాలా బంగారం వుంది కదా! వడ్డాణం.... కాసుల పేరు వగైరా పాత నగలు పాతరేసి వుంటారు. బైటికి తియ్యండి."

సావిత్రికి గొంతులో తడి ఆరిపోయింది.

"ఏమిటి? బంగారం ఇస్తారా, లేక మీ అమ్మాయిని కత్తితో పొడిచి చంపమంటారా?"

"వద్దు.... వద్దు.... తెస్తాను."

"ఎక్కడికి తెస్తారు?"

"చెప్పు.... ఎక్కడికి తేవాలి?"

"మీ ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో లయోలా లేడీస్ కాలేజి వుంది."

"అవును."

"దానికి కొంతదూరంలో లేడీస్ కాలేజీ తాలుకు హాస్టల్ వుంది. దానికి వందగజాల దూరంలో చర్చివుంది. ఆ చర్చి ప్రక్కన పెద్ద మర్రిచెట్టు వుంది. మీరు డబ్బు

గాని బంగారంగాని ఒక సూట్ కేసులో పెట్టుకుని తీసుకుని రండి. ఆ సూట్ కేస్ నాకు అందిన తర్వాత మీ అమ్మాయి మీకు దక్కుతుంది. లేదా చస్తుంది."

"వద్దు....వద్దు....వస్తాను" అరిచింది సావిత్రి.

"తొందరగా రావాలి."

"అలాగే!"

"గుర్తుంచుకోండి. ఈ సంగతి పోలీసులకుగాని మరెవరికైనాగాని చెప్పారంటే మీ ప్రాణాలు గూడా దక్కవు. మీరు ఎవరికి ఫోన్ చేసిందీ అన్నీ మావాళ్ళు గమనిస్తుంటారు."

"లేదు....లేదు....ఎవరికీ చెప్పను" అంది సావిత్రి చెమటపట్టిన ముఖాన్ని తుడుచుకుంటూ.

"చెప్పినట్లు నడుచుకోండి."

"అలాగే!"

"మీ కోసం ఎదురుచూస్తుంటాను మేడమ్."

ఫోన్ పెట్టేసినట్లు రిసీవర్ లో క్లిక్ మని శబ్దం వినిపించింది.

సావిత్రి సోఫాలో కూలబడిపోయింది.

'ఏభైవేలు' 'అమ్మో' అనుకుంది. చూస్తూ చూస్తూ ఏభై వేలు....వాడి మొఖాన ఎలా కొట్టడం? మరిప్పుడు ఏం చెయ్యాలి? పోలీసులకి ఫోన్ చేస్తే?

లాభంలేదు వాడు అవన్నీ గమనిస్తుంటాడు.

"అమ్మా! నాకు పాతికరూపాయలు కావాలే" అంటూ బాబీ లోపలకు వచ్చాడు.

బాబీ లోపలకు రాగానే సావిత్రి మనసులో ఒక ఆలోచన మెరిసింది.

"ఒరేయ్ బాబ్జీ. ఇలారా నాన్నా! నువ్వు అర్జెంట్ గా

ఒక పని చెయ్యాలి. ఎవరికీ ఏమీ చెప్పగూడదు" అంది ఆమె.

పదిహేనేళ్ళ బాబ్జీ నివ్వెరపోయి తల్లివంక చూశాడు.

"ఏం చేస్తావా?"

బాబ్జీ తల వూపాడు.

సావిత్రి ఆదరాబాదరా పోలీస్ ఇన్స్పెక్టర్ కి జరిగినదంతా, బైరాగి చెప్పిన వివరాలన్నీ ఒక కాగితంలో రాసింది. వెంటనే సహాయం చేసి తన కూతుర్ని రక్షించమని అందులో వేడుకుంది.

ఆ కాగితాన్ని ఒక కవరులో పెట్టి ప్లేస్టు చేసి బాబ్జీ ప్యాంట్ జేబులో పెట్టింది.

"జాగ్రత్త. ఇన్స్పెక్టర్ కే ఇవ్వు." అంది.

బాబ్జీ తలూపుతూ పరిగెత్తుకుంటూ వెళ్ళాడు.

3

సుధారాణికి బ్రతికుండగానే నరకం అనుభవిస్తున్నట్టుంది.

ఆ దుర్మార్గుడు రెండు చేతులూ వెనక్కి విరిచి తాడుతో గట్టిగా కట్టేశాడు. చేతులు నొప్పిపుడుతున్నాయి. పైగా నిలువుకాళ్ళ మీద అలా ఎంతసేపు నిల్చోవాలో తెలియడంలేదు. ఆమెకు నీరసం ముంచుకొస్తోంది.

ఆ గడ్డంవాడు లాంతరు వెలిగించుకుని ఆ వెలుగులో రొట్టెలు తింటున్నాడు. అప్పటిదాకా వాడు బ్రాందీ తాగుతూ కూర్చున్నాడు. తాగడం పూర్తయ్యాక సీసా విసిరిపారేసి ఇప్పుడేమో తింటూ కూర్చున్నాడు.

తింటూ తింటూ ఆమెవంక చూశాడు. నవ్వాడు పకపకా.

"ఆకలివేస్తోందా?" అన్నాడు.

ఆమె తల వూపింది అవునన్నట్టుగా.

బ్రెడ్ ముక్కలు కాగితంలో పెట్టుకొచ్చి "తిను" అన్నాడు.

ఆమె అలాగే చూస్తూ వుండిపోయింది.

"ఓ.... చేతులు లేవుగదూ! తినిపించనా?" అంటూ ఒక ముక్క ఆమె నోటిలో వుంచబోయాడు.

ఆమె కాండ్రించి వూసి "వద్దు.... నేను తినను" అని గట్టిగా అరిచింది.

"భలే! ఆకలైందని ఏడుస్తున్నావ్! తినిపించబోతే వద్దంటావు. బాగుంది" అన్నాడు అతను.

"ఒక్క చెయ్యి విడిపించు. తింటాను" అంది ఆమె.

అతను ఏదో ఆలోచించుకొని ఒక చేతిని విడిపించి బ్రెడ్ ముక్కలు ఆమె చేతికి ఇచ్చాడు. ఆమె ఒక్కొక్కటే తినేసింది.

అతను మారంగా చూస్తున్నాడు.

"ఇంకెంతసేపులే. ఈ పాటికి మీ అమ్మ వస్తూ వుంటుంది. మా వాడికి సూట్ కేసు అందిస్తుంది. వాడు నీ కారులోనే వస్తూనే నాకు లైటుతో సంజ్ఞ చేస్తాడు. ఇక నీకు నాకూ రామ్.... రామ్!" అన్నాడు.

"ఏమిటీ మా అమ్మ మీకు డబ్బు ఇస్తానందా?"

"ఆఁ.... ఇవ్వక ఏం చేస్తుంది? ఇవ్వకపోతే నిన్ను చంపుతామని బెదిరించాం గదా!"

సుధారాణికి ఏడుపు ముంచుకొచ్చింది.

"నన్ను వదిలెయ్ నీకు పుణ్యం వుంటుంది" అంది బ్రతిమాలుతూ.

"తొందరపడకు వదుల్తా!" అన్నాడు అతను సుధారాణి వంక చూస్తూ.

అప్పుడామె పైట జారిపోయి వుంది. గులాబి రంగు పాలిస్టర్ చీరలో, లాంతరు మసక వెలుగులో ఆమె అందం అమావాస్యనాడు చుక్కలా మెరిసిపోతోంది.

అతను కాంక్ష నిండిన కళ్ళతో మత్తుగా చూశాడు. అతనిలో మగాడు నిద్ర లేచాడు. మందు త్రాగకముందు మాత్రం ఆమె మీద ఏ విధమైన అత్యాచారం చెయ్యకూడదనే అనుకున్నాడు. డబ్బు మాత్రమే గుంజుకుని మర్యాదగానే వదిలేద్దాం అనుకున్నాడు. కాని కడుపులోకి మందు పోయాక అవన్నీ గాలికి కొట్టుకుని పోయాయి.

ఆమె నిస్సహాయ స్థితి అతనికి వంటరిగా మత్తులో వున్నప్పుడు ఆడది దొరకటం మనస్సుని చలింపజేస్తున్నాయి.

అతను దగ్గరగా వచ్చి ఆమె బుగ్గల మీద చెయ్యివేసి "పాపం, సుకుమారి. చెయ్యి నొప్పి పుడుతోందా?" అన్నాడు.

ఆమె అతని చేతిని విదిల్చి కొడుతూ "నేను నీకేం ద్రోహం చేశాను? నన్నెందుకిలా ఏడిపిస్తున్నావ్?" అంది ఏడుస్తూనే.

ఆ మాటలకి అతనికి కోపం బుస్సుమని పొంగింది.

"నాకు ద్రోహం చేశావో లేదో సరిగ్గా చూడు" అంటూ గడ్డం మీసం పీకి పారేశాడు.

ఆమె ఆశ్చర్యంతో అతని వంక చూసి "నువ్వా జార్జ్?" అంది.

"అవును నేనే! ఇప్పుడు చెప్పు! చెప్పుడు మాటలు విని నిర్దాక్షిణ్యంగా నన్ను వుద్యోగంలో నుంచి తీసి వెయ్యలేదూ?" అన్నాడు కసిగా.

"జార్జి! నన్ను మోసం చేసి లారీలో సామాను అమ్ముకోలేదా? టాంకులో డీసెల్ దొంగచాటుగా అమ్ముకుని త్రాగి తందనాలు ఆడలేదూ! ఆడదిలే అని నన్ను చిన్నచూపు చూస్తే సహించలేకపోయాము. నేను మాత్రం ఎంతకని సహించను? అందుకే వార్నింగులు యిచ్చి యిచ్చి విసుగు పుట్టి తీసేశాను,"

"అయితే మీ ఫ్యాక్టరీలో నేనొక్కడినేనా దొంగను? మరి ఆ మేనేజరు సీతారామయ్య సంగతి ఏమిటి?పందికొక్కులా తింటూ వుంటే నీకు బాగుందా?"

"అదంతా నీ పొరబాటు."

"ఇష్టమైతే అంతేలే!"

"పిచ్చిగా మాట్లాడకు."

"అవును నేను పిచ్చివాడినే. అప్పుడు నీ చేతిలో మనిషినిగదా అని తీసిపారేసి ఏడిపించావు. ఇప్పుడు నువ్వు నా చేతిలో వున్నావు. కాలం తిరగబడింది" పక పక నవ్వాడు జార్జి.

అతని నవ్వు చూస్తే ఆమెకు వణుకు పుట్టింది.

అతను ఆమె తలను తన చేతుల్లోకి తీసుకుని ఆమెను ముద్దు పెట్టుకున్నాడు.

సుధారాణి ఏడుస్తూ అతని ముఖం మీద వుమ్మి వూసింది. తిట్టింది.

అతను ఆ తిట్లన్నీ దీవనలుగా భావించి నవ్వుతూ తన రెండు చేతుల్లో ఆమెను బంధించాడు.

ఆమె కెవ్వున కేకపెట్టి అతన్ని దూరంగా నెట్టడానికి ప్రయత్నించింది. అతను కదల్లేదు. అతను తూలుతూనే ఆమెను గట్టిగా పట్టుకుంటున్నాడు. ఆమె బ్లౌజు చిరిగి ముక్కలైంది. ఆమెకు ఎక్కడలేని ఆవేశం వచ్చింది.

అతన్ని దూరంగా పడేటట్లు నెట్టిపారేసింది. జార్జి వెల్లకిలా పడ్డాడు. ఆమె ఒక చేత్తోనే గబ గబా కట్లు విప్పేసుకుంది. జార్జి నిషాలో తూలుతూ లేస్తున్నాడు.

ఆమెను కట్టేసి వుంచినపుడు ఆమె దృష్టిని ఆకర్షించింది ఒక రాతి గద. అది ఇప్పుడు ఆమెకు వుపయోగించింది. ఒక్క పరుగున దాన్ని అందుకుని జార్జి తలమీద బలంగా కొట్టింది.

జార్జి చావుకేక పెట్టి, లేవబోతున్నవాడల్లా విరిగిన మహావృక్షంలా కూలిపోయాడు. క్షణాల్లో అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

సుధారాణి లాంతరు పట్టుకుని దారి చూసుకుంటూ కొండ క్రిందకు దిగసాగింది.

జార్జి కారు ఆపిన చోట కారు లేదు. ఆమెకు జార్జి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. జార్జి అనుచరుడు తన కారు తీసుకుని వెళ్ళిపోయాడు. అమ్మ ఇస్తానన్న డబ్బు కోసం వాడు వెళ్ళి వుంటాడు.

సుధారాణి లాంతరు పట్టుకుని వీలయినంత వేగంగా రోడ్డు మీదకు చేరుకుంది. ఆమె రోడ్డుమీదకు చేరుకున్నాక పోలీస్ జీప్ వచ్చి ఆగింది.

అందులో నుంచి ఇన్‌స్పెక్టర్ దిగాడు.

"సుధారాణిగారూ! ఏం జరిగింది?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ దివాకర్.

సుధారాణి జరిగిందంతా వివరంగా చెప్పింది.

"మై గాడ్! అయితే మీరు జార్జిని మర్డర్ చేశారన్న మాట!" అన్నాడు దివాకర్.

"అవును ఇన్‌స్పెక్టర్, నా శీలం కాపాడుకోవడానికి హత్య చెయ్యక తప్పలేదు" అంది సుధారాణి.

"ఇట్స్ ఆల్ రైట్. మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నన్ను అరెస్టు చేస్తారా? ఎందుకు?"

"ఎందుకేమిటి! మీరు జార్జిని హత్య చేసినందుకు."

"ఛీ....అది ఏ పరిస్థితుల్లో చేశానో చెప్పానుగదా!"

"అది నిజమే. మా ఫార్మాలిటీస్ మాకున్నాయి. అయితే మీరు బెయిల్ మీద విడుదల కావచ్చును" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నా కారు జార్జిమనిషి ఎత్తుకునిపోయాడు!" అంది సుధారాణి.

"ఎక్కడికి పోతాడు? మీ కారు ఎక్కడికీ పోదు లెండి."

"మీరు ఇక్కడికి ఎలా వచ్చారు?"

"మీ అమ్మగారు రిపోర్టు చేశారు మిమ్మల్ని ఎవడో బైరాగి కిడ్నాప్ చేశాడనీ, ఏభై వేలు ఇమ్మని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడనీ" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"సమయానికి వచ్చారు. థాంక్స్" అంది సుధారాణి పమిట చెంగు కప్పుకుంటూ.

"మేం రాకముందే మిమ్మల్ని మీరే రక్షించుకున్నారుగా!"

"అవును ఇన్‌స్పెక్టర్! అంత బలం నాకు ఎలా వచ్చిందో అర్థంకావడంలేదు. జార్జిని నేను ఎలా హత్య చేయగలిగానో తల్చుకుంటే ఆశ్చర్యంగా వుంది" అంది ఆమె.

4

"సుధారాణిగారూ! మీరు పెద్ద ఆపదనుంచి బైట పడ్డారని విన్నాను. ఐయామ్ వెరీ హాపీ నా!" అన్నాడు విజయ్ ఆమె ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ.

"థాంక్స్...." అంది సుధారాణి డెయిలీ పేపర్ చూస్తూ.

"జార్జి అంతపని చేశాడా? రాస్కెల్. మంచి పని చేశారు. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నారు. వాడికి తగిన శిక్ష విధించారు లెండి."

"నా ప్లేస్‌లో ఎవరున్నా అంతే చేస్తారు."

"నో....నో... అంతా అలా చేస్తారనుకున్నారా? ఆ డేర్ నెస్ మీకు కాబట్టి చెల్లింది. ఆడపిల్లల్లో ఆ డేర్ నెస్ వుంటే దేశంలో ఇన్ని రేప్ కేసులు జరుగుతాయా?" నవ్వాడు విజయ్.

సుధారాణి పొడిగా నవ్వింది.

"మా నాన్న ఈ సంగతి చెప్పారు. స్టన్ అయ్యాననుకోండి. బెయిల్ మీద మిమ్మల్ని రిలీజ్ చేశారటగా! ఆత్మరక్షణకోసం హత్యచేస్తే అది హత్యక్రిందికిరాదు లెండి. యూ విల్ బీ సేవ్‌డ్" అన్నాడు విజయ్.

"నేనూ అలాగే అనుకుంటున్నాను."

సుధారాణి తమ్ముడు బాబ్జీ, చెల్లెలు లీల పుస్తకాలు తెచ్చుకుని కూర్చున్నారు.

"అంకుల్ పాఠాలు చెప్తారా?" అన్నాడు బాబ్జీ.

"ఈ రోజు మీకు పాఠాలు చెప్పను" అన్నాడు విజయ్.

బాబ్జీ, లీల ప్రశ్నార్థకంగా చూశారు.

"మీ అక్కయ్య పెద్ద ఆపదనుంచి బైటపడిన శుభ

సందర్భంగా మీకు సెలవు" అన్నాడు విజయ్ నవ్వుతూ.

బాబ్జీ, లీల పుస్తకాలు సర్దుకుని వెళ్ళిపోయారు.

"అమ్మాయ్! నిన్నొకసారి ప్లీడరుగారు రమ్మన్నారే" అంటూ వచ్చింది సావిత్రి.

"అలాగేనమ్మా!" అంది సుధారాణి.

"విజయ్! పిల్లలకి పాఠాలు మొదలుపెట్టలేదేం"" అంది సావిత్రి కూర్చుంటూ.

"మీ సుధారాణి గొప్ప ఆపదలో చిక్కుకుని బైట పడిన సంగతి తెలిశాక నా మైండ్ అబ్సెంటైపోయింది. అందుకే మీ పిల్లలకు సెలవు ఇచ్చేశాను" అన్నాడు విజయ్ నవ్వుతూ.

"అవును విజయ్! అదృష్టంవల్ల బైటపడింది. తల్చుకుంటేనే వణుకుపుడుతోంది నాకు" అంది సావిత్రి జరిగిపోయిన సంఘటన జ్ఞాపికి తెచ్చుకుంటూ.

"ఆ జార్జిగాడికి అంత ధైర్యం ఎలా వచ్చిందో అర్థం కావడంలేదు. అసలు ఇటువంటి ఐడియాలన్నీ సినిమాలు చూసి నేర్చుకుంటున్నారు ఆంటీ!" అన్నాడు విజయ్.

"ఏం చచ్చారో వెధవలు, మా ప్రాణానికి దాపురించారు. చేసేవన్నీ వెధవపనులు. అడ్డుచెప్తే కోపాలు. పనిలోనుంచి తీసేస్తే ఇదిగో ఇటువంటి బెదిరింపులు. ఛీ....ఛీ....డబ్బున్నా సుఖంలేదు" అంది సావిత్రి.

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది.

సుధారాణి సోఫాలోనుంచి లేచివెళ్ళి మాట్లాడి వచ్చింది.

"ఎవరే?" అంది సావిత్రి.

"ఇన్స్పెక్టర్ గారు ఫోన్ చేశారు."

"ఏమిటట?"

"మనకారు దొరికిందట."

"ఎక్కడ?"

"శ్రీశైలం రోడ్డులోనట."

"పోనీలే...." అని నిట్టూర్చింది సావిత్రి.

"కారు దొరికిందిగాని దాని టైర్లు ఊడదీసుకుని పోయారట" అంది సుధారాణి.

విజయ్ నవ్వి "దొరికిందేచాలని టైర్లు దొంగిలించుకు పోయివుంటారు కక్కుర్తి వెధవలు" అన్నాడు.

"బాగా చెప్పావు" అంది సావిత్రి.

"ప్లీడరుగారితో మాట్లాడివస్తానమ్మా!" అని వెళ్ళి పోయింది సుధారాణి. తర్వాత విజయ్ కూడా సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

చీకటి పడుతూవుండగా సీతారామయ్య వచ్చాడు. అతను వాళ్ళ ఫ్యాక్టరీ మేనేజరు.

"రండి సీతారామయ్యగారూ!" అంది సావిత్రి.

సీతారామయ్య వచ్చి కూర్చున్నాడు.

సీతారామయ్య సన్నగా ఎర్రగా వున్నాడు. గ్లాస్కో పంచె కట్టి, తెల్లటి టెర్రీకాట్ లాల్చీ వేసుకున్నాడు. దాదాపు ఏభై ఏళ్ళు వుంటాయి అతనికి.

"ఇప్పుడే మీ విజయ్ వెళ్ళాడు" అంది సావిత్రి.

"ఇవాళ వాడు ట్యూషన్ చెప్పలేదా పిల్లలకి?"

"లేదు. సెలవు ఇచ్చాడు. అమ్మాయికి ఆపద తప్పి నందుకట" అంది సావిత్రి.

"బాగుంది. ఆడపిల్ల అలా వంటరిగా తిరుగుతుంటే ఆపదలు రాక ఏమౌతుంది? నా మాటవిని వెంటనే పెళ్ళి ఏర్పాట్లు చేస్తే మంచిది" అన్నాడు.

"నేనేం చెయ్యను?"

"గట్టిగా చెప్పాలి."

"ఎన్నిసార్లు చెప్పను! వాగి వాగి నా నోరు పడిపోతున్నది తెలుసా? ఆ రమణగాడి చదువు పూర్తయ్యాక చేసుకుంటానని ఖచ్చితంగా చెప్పింది."

సీతారామయ్య ముఖం మాడిపోయింది.

"మా విజయ్‌కి ఏమి తక్కువ?"

"తక్కువని ఎవరన్నారు?"

"నువ్వనడం కాదు సావిత్రీ! రాణీని విజయ్‌కిచ్చి పెళ్ళి చేస్తే నీకు ఎంత హాయిగా వుంటుంది. ఇంట్లో కలిసిపోయిన మనిషి కదా!"

"నిజమే! నేనేం చెయ్యను! నేను విజయ్ గురించి ఎన్నిసార్లో చెప్పాను."

"ఆ రమణ డాక్టరని మురిసిపోతోంది. సరే! వాడి సంగతి ఆ పసిదానికేం తెలుసు! ఎలా వాడిని పెళ్ళి చేసుకుంటుందో చూస్తాను!" క్రూరంగా నవ్వాడు సీతారామయ్య.

సావిత్రి ఏమీ మాట్లాడలేదు.

5

హాస్టల్ గది తాళం తీస్తుంటే పోస్టుమాన్ వచ్చి ఒక కవరు వెంకటరమణకు అందించాడు.

"ఎవరు రాశారబ్బా!" అనుకుంటూ కవరు చించాడు. ఆ లెటర్‌లో అక్షరాలు అతనికి పరిచయమైనవి కావు. అడుగున సంతకం చూశాడు. 'రావు' అని వుంది తారీఖు వేసి.

"ఎవరీ రావు? సుబ్బారావా? శంకర్రావా? రామారావా? వెంకట్రావా? ఎవరు? తనకి ఎందరో రావులు వున్నారు ఫ్రెండ్స్ సర్కిల్లో. ఎవరీ 'రావు' ఎందుకు

లెటర్ రాశాడు అనుకుంటూ చదవసాగాడు.

"డియర్ రమణా!

నువ్వు వైజాగ్ వెళ్ళి మూడు నెలలు దాటిందను కుంటాను. ఈ మధ్య అనుకోకుండా ఒక భయంకరమైన సంఘటన జరిగింది.

సుధారాణి వాళ్ళ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పని చేస్తున్న జార్జి అనేవాడిని వుద్యోగం నుంచి తొలగించింది. వాడు పగబట్టి ఒకరోజు సాయంకాలం సుధారాణిని కారుతోసహా కిడ్నాప్ చేశాడు. ఏభై వేలు ఇస్తే వదిలిపెడతానని వాళ్ళ అమ్మని బ్లాక్‌మెయిల్ చేశాడు. సుధారాణిని ఒక పాడుబడిన గుడికి తీసుకెళ్ళి రేప్ చేశాడు.

ఆ తర్వాత సుధారాణి జార్జిని హత్య చేసింది. పోలీసులు ఆమె మీద హత్యానేరం మోపి కేసు పెట్టారు. అయితే తీర్పు సుధారాణికి అనుకూలంగా వస్తుందని అంతా అభిప్రాయపడుతున్నారు. ఆత్మరక్షణ కోసం గదా హత్య చేసింది?

పాపం ఆమె మానసికంగా ఎంతో క్రుంగిపోతోంది. స్త్రీకి విలువయిన శీలం కోల్పోతే అంతేగదా! మీ రిద్దరూ ప్రేమించుకున్నారనీ, పెళ్ళి చేసుకోబోతున్నారనీ తెలిసిన వాడిని గనుక ఈ లెటర్ రాస్తున్నాను.

ఈ క్లిష్టసమయంలో ఆమెకు అండగా వుండవలసిన బాధ్యత వుంది నీకు. వెంటనే వచ్చి ఓదార్చు.

సెలవు,

రావు."

ఆ లెటర్ చదివిన తర్వాత నెత్తిన పిడుగు పడిన వాడిలా అయిపోయాడు. కొన్ని నిమిషాలపాటు మెద

డంతా మొద్దుబారిపోయినట్లయింది. కళ్ళు గిర్రున తిరిగి నట్లనిపించి కళ్ళు మూసుకున్నాడు. కళ్ళముందు సుధా రాణి రూపం ప్రత్యక్షమైంది.

తన హౌస్ సర్జెన్సీ పూర్తయ్యాక పెళ్ళి చేసుకోవా లనుకున్నారు. ఇంతలో ఈ అవాంతరం. సుధారాణితో తన పెళ్ళి దాదాపుగా ఖాయమైనట్లే. తన తల్లిదండ్రు లకు ఆమెతో పెళ్ళి అంగీకారమే. ఆమె బాగా ధన వంతురాలు కూడా. ఆమెతో తన పెళ్ళి జరుగుతుందని ఎన్నో కలలు కన్నాడు.

ఇంతకీ తన దురదృష్టం. సుధారాణిని జార్జి రేప్ చేశాడు. ఆమె శీలం కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తన తల్లిదండ్రులు ఆమెతో పెళ్ళి జరగడానికి ఒప్పు కోరు. వాళ్ళు అసలే పాతకాలం మనుషులు. ఎప్పుడూ పూజా పునస్కారాలు చేస్తూ పాత ఆచారాలను పట్టు కుని వ్రేలాడుతూ వుంటారు. వాళ్ళ దృష్టిలో సుధా రాణి చెడిపోయిన ఆడది.

తను సుధారాణిని పెళ్ళి చేసుకోవాలంటే తల్లి దండ్రులను ఎదిరించాలి. వాళ్ళతో బంధాన్ని త్రెంచు కోవాలి.

ఆ రాత్రంతా వెంకటరమణలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. అతనికి నిద్రపట్టడం లేదు.

కళ్ళు మూసుకుంటే చాలు నల్లగా భయంకరంగా వున్న వ్యక్తి సుధారాణి వెంటపడి తరుముతున్నాడు. ఆమె బట్టలు చించేస్తూ రేప్ చేస్తున్న దృశ్యం కని పిస్తోంది.

వెంకటరమణ ఆ మానసిక వేదన భరించలేకపోయాడు. అతనికి ఏడుపు ముంచుకొస్తోంది. సుధారాణి తనకు

దక్కదు అనే ఆలోచనే భరించలేకపోతున్నాడు.

తనే ఇంత బాధను అనుభవిస్తుంటే సుధ ఎంతగా కుమిలపోతున్నదో!

'వెంటనే వెళ్ళాలి' అనుకున్నాడు వెంకటరమణ.

6

వెంకటరమణ ట్రైన్ దిగేటప్పటికి వుదయం పది దాటింది. సూట్ కేస్ చేత్తో పట్టుకుని రిక్షా ఎక్కి అడ్రస్ చెప్పాడు. రిక్షా మెయిన్ రోడ్డులోనుంచి పోతుంటే 'ఒరేయ్' అనే కేక, ఆ వెనుక చప్పట్లు వినిపించాయి.

రిక్షా రోడ్డుప్రక్కన ఆపించి వెనక్కి తిరిగి చూశాడు. శేషగిరిరావు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వస్తున్నాడు నవ్వుతూ.

"ఏరా! ఇదేనా రావడం?" అన్నాడు వస్తూనే.

"ఆఁ....." అన్నాడు రమణ.

"రిక్షా దిగు కాఫీ తాగి నడచుకుంటూ పోదాం" అన్నాడు శేషగిరిరావు.

రమణ తల వూపి రిక్షాదిగి డబ్బులిచ్చి పంపేశాడు.

ఇద్దరూ శంకర్ విలాస్‌లోకి వెళ్ళి స్పెషల్ రూమ్‌లో కూర్చున్నారు.

బేరర్ రాగానే కాఫీ చెప్పాడు శేషగిరిరావు.

"ఎలా వుందిరా నీ బిజినెస్?" అన్నాడు రమణ.

"మూడు పువ్వులు-ఆరు కాయలు" నవ్వాడు శేషగిరి.

"ఏమిటి విశేషాలు?"

"నువ్వే చెప్పాలి."

రమణకి ఏమీ తోచలేదు. ఆ సంగతి శేషగిరి దగ్గర ఎత్తాలంటే బాధ అనిపిస్తోంది.

"వూరికినే వచ్చా!" అన్నాడు పొడిగా నవ్వుతూ.

"నీకు తెలుసా ఆ సంగతి?" ప్రశ్నించాడు శేషగిరి.

"ఏ సంగతి?"

"అదే సుధారాణి...."

"లెటర్ రాసింది నువ్వేనా?" సూటిగా ప్రశ్నించాడు రమణ.

"ఏ లెటర్?"

రమణ సమాధానం చెప్పకుండా సూట్ కేసులోంచి రావు పేరుతో వచ్చిన లెటర్ చూపించాడు.

అది చదివి "నేను రాయలేదురా యిది" అన్నాడు శేషగిరి.

"ఎవరు రాశారో అర్థం కావటం లేదు."

"ఎవరో మనవాడే రాసి వుంటాడు. నువ్వు ఆమెను పరామర్శించడానికి వచ్చావా?"

"ఆఁ...." అన్నాడు రమణ దిక్కులు చూస్తూ.

"మొత్తానికి చాలా ఘోరం జరిగిపోయిందిరా. ఇటీవల ఆడదానికి రక్షణ లేకుండాపోతోంది. ఇదుగో ఈ కరపత్రం చూడు" జేబులోనుంచి తీసి ఇచ్చాడు శేషగిరి రావు రత్నావళి రంగులో వున్న కరపత్రం.

ఆ కరపత్రం పౌరహక్కుల సంఘంవాళ్ళు వేశారు. అందులో ఇటీవల టౌన్ చుట్టుప్రక్కల జరిగిన సంఘటనల గురించి రాశారు. ఆడవాళ్ళమీద అత్యాచారాలు, ఒక కానిస్టేబుల్ టౌన్‌కి వచ్చిన ఒక మైనర్ బాలికను చెరచడం వంటివి కొన్ని వివరంగా వున్నాయి. కరపత్రంలో హైలెట్ సుధారాణి మీద జరిగిన అత్యాచారం. తనను రేప్ చేసిన జార్జని హత్య చేసినందుకు ఆమెను అభినందించారు. ఆమె అభినవ మహిషాసుర

మర్దని అని పొగిడారు. ప్రభుత్వం అరాచక శక్తులను అణచివేసి ప్రజలకు ముఖ్యంగా ఆడవాళ్ళకు రక్షణ కల్పించవలసిందని అభ్యర్థించారు హక్కుల సంఘం వారు.

"సుధారాణి రేప్ చేయబడిందని తెలియనివారికి గూడా తెలిసిపోతోంది ఆ కరపత్రం ద్వారా!" రమణ నిట్టూర్చాడు అంతా చదివి.

"పద పోదాం" అన్నాడు రమణ.

శేషగిరి బిల్లు చెల్లించాడు.

ఇద్దరూ మాట్లాడుకుంటూ బయల్దేరారు.

ఇంటికి వెళ్ళాక తల్లిదండ్రులతో పాడి పాడి మాటలు మాట్లాడి స్నానం చేసి డ్రెస్ చేసుకున్నాక సుధారాణి కోసం ఇంటికి ఫోన్ చేశాడు. ఆమె తల్లి సావిత్రి మాట్లాడింది. సుధారాణి ఫ్యాక్టరీలో వుందని చెప్పింది. ఎటూ ఫ్యాక్టరీలో వుందని తెలిసింది గనుక ఫోన్ చెయ్యకుండానే స్కూటర్ వేసుకుని బయల్దేరాడు.

సుధారాణి రేప్ చేయబడింది. ఇందులో ఆమె తప్పు ఏముంది? ఏమీ లేదు. మనసు పవిత్రంగా వుండాలి గాని శరీరానికి మాలిన్యం యేముంది? తను సుధారాణిని మనస్ఫూర్తిగా ఓదార్చాలి. ధైర్యంగా ఆమెను స్వీకరించాలి. తల్లిదండ్రులు ఒప్పుకోకపోయినా ఎదిరించాలి! అలా ఆలోచిస్తూ వెళ్ళాడు రమణ.

రమణను చూస్తూనే ఆశ్చర్యపోయింది సుధారాణి.

"ఎప్పుడొచ్చావ్?" అంది.

"ఇప్పుడే. స్నానం చేసి యిలా వచ్చాను."

ఆఫీసు రూమ్‌లో ఇద్దరే కూర్చున్నారు.

ఆమె బజర్ నొక్కి జవాన్ని కేకేసి రెండు కూల్

డ్రింక్స్ తెప్పించింది.

"ఇక్కడ జరిగిందంతా రావు అని ఎవరో ఒక లెటర్ రాశాడు. పౌరహక్కుల సంఘంవాళ్ళు వేసిన కరపత్రం గూడా చూశాను" అన్నాడు రమణ.

"నేనూ చూశాను ఆ కరపత్రం. కాని అదంతా నిజం కాదు రమణా!" అంది సుధారాణి.

"సుధా!...." ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును రమణా! వాడు నన్ను రేప్ చేశాడని ఎవరో పుకారు పుట్టించారు. వాడు ప్రయత్నించిన మాట నిజమే. కాని నేను లొంగలేదు. వాడిని హత్య చేశాను" అంది గంభీరంగా.

"మరి ఇదంతా ఎలా పాకింది?"

"ఏమో అర్థం కావడం లేదు. అసలు మన వూళ్ళో పౌరహక్కుల సంఘం యెక్కడుందో తెలియలేదు. ఇన స్పెక్టర్ దివాకర్‌తో ఆ విషయం మాట్లాడాను. అటు వంటి సంఘం వున్న సంగతి తనకి తెలియదని అన్నాడు. ఎనీహౌ నామీద రేప్ జరగలేదనీ అదంతా పుకారనీ పేపరు ప్రకటన ఇచ్చాడు. చూడు" అంటూ సుధారాణి డెయిలీ పేపర్ రమణకి అందించింది.

సుధారాణి మీద పౌరహక్కుల సంఘం వాళ్ళు రాసింది శుద్ధ తప్పు అనీ, ఆమెను జార్జి రేప్ చెయ్య లేదనీ ఇన్‌స్పెక్టర్ దివాకర్ ఖండిస్తూ ఇచ్చిన ప్రకటన అందులో వుంది.

రమణకు అదంతా ఎందుకో కృత్రిమంగా వున్నట్లు అనిపించింది. జార్జి అనేవాడు ఆమెను రేప్ చేసి వుండ వచ్చు. అయితే అందువల్ల తనకి చెడ్డపేరు వస్తుందనీ, చెడిపోయిన ఆడది అని చెప్పుకుంటారనీ సుధారాణి ఈ

విధంగా నాటకం ఆడటం లేదుగదా? అనిపించింది.

తనను చూస్తూనే ఆమె యేడుస్తుందనీ, తను మనస్ఫూర్తిగా ఓదారుస్తాడనీ, ప్రపంచం అంతా ఏకమైనా ఆమెను స్వీకరిస్తానని ధైర్యం చెప్పాలనీ వచ్చాడు. కాని అటువంటి అవసరమే రాలేదు. అసలు యేమీ జరగనట్లే ప్రవర్తిస్తోంది సుధారాణి.

"సుధా! రేప్ జరిగిందా లేదా అన్నదాని మీద తర్జన భర్జన లెందుకు? అందులో నీ తప్పు యేమీ లేదు కదా?"

"లేనిది వున్నట్లుగా యెందుకు రాయాలి వాళ్లు?"

"అలా రాస్తే వాళ్ళకేం లాభం?" అన్నాడు రమణ.

సుధారాణి సీరియస్‌గా చూసింది అతన్ని.

"అంటే నీ వుద్దేశ్య మేమిటి రమణా? నన్ను వాడు రేప్ చేశాడని నువ్వు నమ్ముతున్నావా?"

"జరిగినా గూడా ఫరవాలేదంటున్నాను. శరీరాని కంటే మనసు పవిత్రంగా వుండాలని నా వుద్దేశ్యం" అన్నాడు రమణ.

"నామీద నీకు అనుమానంగా వున్నట్లుంది గదూ! అవును రమణా! నేను నాటకాలు ఆడుతున్నాను. నన్ను వాడు రేప్ చేశాడు. అది నీకు తెలిస్తే పెళ్ళి చేసుకోవని భయపడి నాటకం ఆడుతున్నాను...." అంటూ ఆమె వెర్రిదానిలా వెక్కి వెక్కి యేడుస్తోంది.

"సుధా! నన్ను అపార్థం చేసుకుంటున్నావు."

"లేదు రమణా! బాగా అర్థం చేసుకున్నాను. చెడిపోయిన ఆడదాన్నని నీకు అనుమానంగా వుంది. అటువంటప్పుడు మనం దూరంగా వుండటమే మంచిది" కళ్ళు తుడుచుకుంటూ అంది ఆమె.

"సుధా! ఏమిటి నువ్వనేది?"

"అవును రమణా! మనం దూరంగానే వుండాలి. పెళ్ళంటే నూరేళ్ళ పంట. అనుమానాలతో అపార్థాలతో కాపురం చెయ్యడం నావల్ల కాదు. ప్లీజ్ నన్ను మర్చిపో" అంటూ యేడవసాగింది.

రమణ చిత్తరువులా కూర్చుండిపోయాడు.

7

"ఇన్‌స్పెక్టర్ దివాకర్ స్పీకింగ్ ప్లీజ్!" అన్నాడు ఫోనెత్తి.

"ఇన్‌స్పెక్టర్ గారూ! మీరు వెంటనే మా ఇంటికి రావాలి" సావిత్రి కంఠం ఆదుర్దాగా వుంది.

"ఏం జరిగింది?"

"మా అమ్మాయి పిలిస్తే పలకడంలేదు. గది తలుపులు మూసి వున్నాయి. మీరు వెంటనే రావాలి. నాకు భయంగా వుంది ఇన్‌స్పెక్టర్ గారూ!" అంది సావిత్రి వణుకుతున్న కంఠంతో.

"అలాగే వస్తున్నా!" అన్నాడు రిసీవర్ పెట్టేస్తూ.

ఇన్‌స్పెక్టర్ దివాకర్ పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి సిబ్బందిని వాన్‌లో యెక్కించుకుని సావిత్రి ఇంటికి వెళ్ళేసరికి వుదయం ఎనిమిది గంటలు దాటింది.

"రండి ఇన్‌స్పెక్టర్ గారూ!" అంది సావిత్రి పోర్టికోలోకి వచ్చి.

అప్పటివరకూ ఆమె యేడ్చి యేడ్చి వున్నట్లు చూస్తూనే గ్రహించాడు ఇన్‌స్పెక్టర్. సావిత్రి కళ్ళు యెర్రగా వున్నాయి. ముఖం వుబ్బి వుంది.

ఇద్దరు మగనౌకర్లు, ఒక ఆడపనిమనిషి దీనంగా నిల్చుని చూస్తున్నారు. సావిత్రి పిల్లలు దిగులుగా వున్నారు.

"ఏం జరిగిందో చెప్పండి!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"అమ్మాయికి లేవగానే బెడ్ కాఫీ త్రాగే అలవాటు. మామూలుగా ఆరింటికే నిద్ర లేస్తుంది. ఆరున్నరకి పని మనిషి కాఫీ యిస్తుంది. రోజులాగే పనిమనిషి వెళ్ళింది. రోజూ తలుపులు తీసే వుండేవి. ఈవాళ తలుపులు మూసివున్నాయి. తలుపులు తట్టినా నిద్ర లేవలేదు. కాసేపు చూసి నన్ను పిలుచుకొచ్చింది" అంది సావిత్రి.

దివాకర్ తలుపు నెట్టి చూశాడు. లోపల బోల్టు వేసే వున్నట్లుంది. ఆ గదికి వున్న రెండు కిటికీలూ మూసే వున్నాయి.

"బ్రేక్ చెయ్యండి" అన్నాడు తన సిబ్బందిని.

బలవంతంగా తలుపులు తెరిచారు. లోపల బోల్టు వూడిపోయి భళ్లున తెరుచుకున్నాయి.

వంకాయ రంగులో వున్న నైట్ గౌనులో బెడ్ మీద వుంది సుధారాణి. నిద్ర పోతున్నట్లుగా వున్న ఆమెను చూసి సావిత్రి ఘొల్లున యేడుస్తూ లోపలకు రాబోయింది.

ఇన్‌స్పెక్టరు ఆమెను వారిస్తూ "ప్లీజ్! ఎవరూ లోపలకు రాకండి" అన్నాడు. గది ముందు కానిస్టేబుళ్ళను వుంచి యెవరూ లోపలకు రాకుండా చూడమని ఆదేశించాడు.

ఇన్‌స్పెక్టర్ దివాకర్‌తో పాటు యస్. ఐ. వెంకట్ కూడా గదిలోకి ప్రవేశించాడు.

గది చాలా విశాలంగా వుంది.

కిటికీ ప్రక్కనే సీలింగ్ ఫ్యాన్ క్రింద ఫోమ్ బెడ్ మీద పడుకున్నది సుధారాణి. ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాడు వెంకట్. శ్వాస ఆగిపోయి వుంది.

"సర్! షీ ఈజ్ డెడ్" అన్నాడు యస్.ఐ. వెంకట్.

వెంకట్ మాటలు వింటూనే సావిత్రి యేడుపు స్వరం హెచ్చింది. ఆమెతో పాటు ఇద్దరు ఆడపిల్లలు పెద్దగా యేడుస్తున్నారు. బాబ్జీ వెక్కి వెక్కి చిన్నగా కుమిలిపోతున్నాడు. నౌకర్లు కళ్ళు తుడుచుకుంటున్నారు.

వాళ్ళ ఏడుపులు విని ఇరుగు పొరుగువారు అక్కడ చేరారు. ఆ వీధికంతా తెలిసిపోయింది సుధారాణి చనిపోయిందని.

ఇన్స్పెక్టర్ గదంతా పరిశీలనగా చూస్తున్నాడు తన ఎక్స్‌రే కళ్ళతో. ఆ గదిలో గాడ్రెజ్ బీరువా ఒకటి వుంది. చెక్క టేబుల్, దానిమీద నేషనల్ టూ ఇన్ వన్ టేప్ రికార్డర్. దాని ప్రక్కనే కేసెట్లు దొంతరగా పేర్చివున్నాయి. ఒకమూల చక్రాలున్న స్టాండుమీద గుల్ మార్గ్ ఎయిర్ కూలర్ వుంది. బట్టల స్టాండ్ మీద రెండు మూడు చీరలు, హేంగర్స్‌కి తగిలించి బ్లౌజులు, నైట్ గౌనులు వున్నాయి.

"సర్! ఆ నోట్ బుక్‌లో ఏదో ఒక కాగితం వుంది. ప్లీజ్ సీ!" అన్నాడు యస్.ఐ. వెంకట్.

"అవును" అన్నాడు ఇన్స్పెక్టర్.

అది అశోకా డీలక్స్ నోట్ బుక్. ఒక ప్లాస్టిక్ కోటెడ్ కవర్ మీద అమితాబచ్చన్ ఫోటో వుంది.

"చూడు మిష్టర్ వెంకట్! ఆ నోట్ బుక్ ముట్టుకోకుండా అందులోని కాగితం తియ్యగలవా?"

"యస్సార్!" అంటూ వెంకట్ ఆ నోట్ బుక్‌లో కాగితం లాగాడు.

అది చిన్న స్లిప్. రూళ్ళ కాగితం. అందులో ఇలా వుంది.

అమ్మా!

నేని అవమానం భరించలేక ఆత్మహత్య చేసు కుంటున్నాను.

—సుధ."

"ఈ స్లిప్ ఆ నోట్ బుక్ లోంది కాదు, అవునా?" ప్రశ్నించాడు దివాకర్.

యస్.ఐ. వెంకట్ నోట్ బుక్ కర్రతో ఎత్తిచూసి "యస్సార్ ఈ నోట్ బుక్ కాగితాలు చాలా వైట్ గా వున్నాయి. పైగా అన్ రూల్డు. ఈ స్లిప్ మాత్రం రూళ్ళది" అన్నాడు.

"దట్సాల్ రైట్. అయితే ఈమె విషం పుచ్చుకొని వుంటుంది అనుకుందాం. పాయిజన్ బాటిల్ ఏదైనా దొరుకుతుందేమో చూడు" అన్నాడు గదంతా తీక్షణంగా చూస్తూ.

వెంకట్ గదంతా తీక్షణంగా అంగుళం అంగుళం సెర్చి చేశాడు.

"సార్! పాయిజన్ బాటిల్ దొరకలేదు" అన్నాడు.

"దట్సాల్ రైట్" అంటూ బ్యాక్ డోర్ నెట్టాడు. నెమ్మదిగా తెరుచుకుంది. తలుపుతీసి చూశాడు. కొంచెం దూరంలో బాత్ రూమ్ వుంది.

"మిస్టర్ వెంకట్! అర్జంట్ గా ఫింగర్ ప్రింట్స్ ఎక్స్పర్టు కావాలి. వ్యాన్ తీసుకెళ్ళి రిక్విజిషన్ పెట్టించి తీసుకురా!" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ఓ.కే. సర్" అంటూ వెంకట్ పరిగెత్తాడు గది బైటికి.

మరో అరగంటకి ఫ్యాక్టరీ మేనేజర్ సీతారామయ్య

ఆదరాబాదరా వచ్చాడు. అతని వెనుకే కొడుకు విజయ్ గూడా వచ్చాడు. మేడ బైట గేటు దగ్గిర పోలీసులు జనాన్ని అదుపుచేస్తున్నారు.

"నమస్తే! ఇన్స్పెక్టర్ గారూ!" అన్నాడు సీతారామయ్య వస్తూనే.

ఇన్స్పెక్టర్ విష్ చేశాడు.

సీతారామయ్య గదిలోకి వెళ్ళబోతుంటే పోలీసులు వెళ్ళనివ్వలేదు. గుమ్మంలోనే నిల్చుని కండువాతో కళ్ళు తుడుచుకుని ముక్కు చీదుకున్నాడు. విజయ్ విచార వదనంతో చూస్తూ నిలబడిపోయాడు.

"ఎంత దారుణం జరిగిపోయింది సార్!" అన్నాడు దగ్గరకి వస్తూ.

దివాకర్ తలవూపాడు.

"కొన్ని రోజులుగా అమ్మాయి దిగులుగా వుంటూ వచ్చింది. నేను అనుమానిస్తూనే వున్నాను సార్! ఏదైనా అఘాయిత్యం చేస్తుందేమోనని. వీలున్నప్పుడల్లా ధైర్యం చెప్తూ వుండేవాడిని. జార్జిగాడిని మర్డర్ చేసినందుకు జైలుశిక్ష పడుతుందేమోనని భయపడిందేమో?" అన్నాడు సీతారామయ్య.

"ఏమో! మనం ఏం చెప్పగలం?" అన్నాడు దివాకర్.

"శవాన్ని ఎప్పుడు తీసుకెళ్ళొచ్చంటారు?" ప్రశ్నించాడు సీతారామయ్య.

"పోస్టుమార్టమ్ చెయ్యాలి."

"పోస్టుమార్టమా?"

"అవును."

"అది లేకుండా వీల్లేదా?"

"నో.... సారీ!" అన్నాడు ఇన్స్పెక్టర్ సీరియస్‌గా.

8

"నీ పేరేమిటి?"

"నాగమ్మ."

"చూడు నాగమ్మా! నీకు తెలిసినదంతా నిజం చెప్పాలి. అబద్ధం చెప్పగూడదు" అన్నాడు ఇన్స్పెక్టర్ దివాకర్.

నాగమ్మ తలవూపింది.

"రాత్రి ఎన్నింటివరకూ పనిచేశావు ఆ ఇంట్లో?"

"చిన్నమ్మగారు భోజనం చేసేదాకా వున్నానండీ. తర్వాత వెళ్ళిపోయాను."

"అప్పుడు టైమెంతయింది?"

"ఎనిమిది దాటింది."

"మీ చిన్నమ్మగారికి పడుకోబోయేముందు పాలు త్రాగే అలవాటు వుందా?"

"వుందండీ!"

"పాలు ఎవరిస్తుంటారు?"

"నేనే ఫ్లాస్కులో పోసి పోతానండీ!"

"రాత్రి అలాగే పోశావా?"

"ఆఁ.... పోశానండి."

"పాలుపోసేముందు ఫ్లాస్కు కడుగుతావా?"

"కడగనండి."

"ఏం?"

"ప్రొద్దున్నే ఫ్లాస్కు కడిగి అక్కడ పెడతానండి."

"ఓహోఁ..." అన్నాడు ఇన్స్పెక్టర్ కళ్ళు ఎగరేస్తూ.

"రాత్రి మీ చిన్నమ్మగారు ఎలా వున్నారు? విచారంగా వున్నారా? లేక మామూలుగా వున్నారా?"

"నేను సరిగా చూళ్ళేదండి."

"మీ చిన్నమ్మగారు పాలలో విషం కలిపి త్రాగింది తెలుసా?"

తల వూపింది నాగమ్మ.

"మీ చిన్నమ్మగారి పక్కలోనే పడివుంది గ్లాసు. గ్లాసులోను, ఫ్లాస్కులోను విషం వుంది. ఫ్లాస్కులో పాలుపోసింది నువ్వేనని ఒప్పుకుంటున్నావు గదా! ఇప్పుడు చెప్పు? పాలలో విషం కలిపి ఫ్లాస్కులో కలిపింది నువ్వేనా?" దివాకర్ కంఠంలో తీవ్రత గమనించి నాగమ్మ వణికిపోయింది.

"అయ్యగారూ! సత్తెప్రమాణంగా చెప్తున్నా! నాకే పాపం తెలీదు" అంది నాగమ్మ ఏడుపు నిండిన స్వరంతో.

"వూరికే తెలియదంటే పోతుందా? నిన్ను అరెస్టు చేస్తున్నాం. నిజం చెప్పేవరకూ నీ గతి కటకటాల వెనుకే! తెలిసిందా?"

నాగమ్మ పెద్దగా ఏడ్చింది.

"నోర్మూయ్!" అని గర్జించాడు ఇన్స్పెక్టర్.

9

"మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకోలేదని నేను భావిస్తున్నాను" అన్నాడు ఇన్స్పెక్టర్ దివాకర్.

సావిత్రి తలెత్తి అయోమయంగా చూసింది.

"మరి?" అంది.

"ఎవరో హత్య చేశారు."

వులిక్కిపడింది ఆమె.

"మీరు పూర్తిగా సహకరిస్తే హంతకులెవరో పట్టివ్వగలను" అన్నాడు.

"ఆత్మహత్య చేసుకుంటానని కాగితం రాసిపెట్టిందిగా. అది అమ్మాయి రాసింది కాదంటారా?"

"అది మీ అమ్మాయి రాసిందే!"

"మరి ఎలా అనుమానిస్తున్నారు?"

"ఆ కాగితం అప్పుడు రాసింది కాదు. చాలా రోజుల క్రితం రాసిందే. ఆ కాగితం మీద అక్షరాలు ఆకుపచ్చ ఇంకుతో రాసినవి. కాని మీ అమ్మాయిగారి గదిలో ఎక్కడా మాకు ఆకుపచ్చ పెన్ కనపడలేదు. డ్రాయరు సొరుగులో బ్లూ కలర్ బాల్ పెన్, రెడ్ ఇంక్ పెన్ వున్నాయి. దాన్నిబట్టి ఆ కాగితం ఆ రాత్రి రాసింది కాదని చెప్పగలను."

సావిత్రి నివ్వెరపోయి వింటూ వుంది.

"తర్వాత గది వెనుక తలుపు తీసేవుంది. పోనీ ఆమె బాత్ రూమ్‌కి వెళ్ళి వచ్చి మర్చిపోయిందనుకుందాం. ఫ్లాస్కులో వున్న పాలచుక్కల్లో విషం కలిసివుంది. ఎవరైనా విషం గ్లాసులో కలుపుకుంటారుగాని ఫ్లాస్కులో కలుపుకుంటారా? ఇంకొక విచిత్రం ఏమిటంటే మీ అమ్మాయిగారు స్లిప్ పెట్టిన నోట్ బుక్ మీద ఆమె వేలి ముద్రలు లేవు. తన వేలిముద్రలు బుక్ మీద పడకుండా అతి జాగ్రత్తగా వుండవలసిన అవసరం ఆమెకు ఏమిటి? కాబట్టి ఎవరో అతి తెలివిగా ఈ హత్య చేశారు.

సావిత్రి బొమ్మలా సోఫాలో కూర్చుండిపోయింది.

"మీరు మీకు తెలిసినవన్నీ దాచకుండా చెప్పండి. మీకు అంటే మీ ఇంటితో అతి సన్నిహితంగా మసలుతున్న వ్యక్తులే ఈ హత్య చేశారు. మీకు ఇప్పుడు ఎవరిమీదనైనా అనుమానం వుంటే చెప్పండి" అన్నాడు.

సావిత్రి బొటబొట కన్నీళ్ళు కారుస్తూ "ఇన్స్పెక్టర్ గారూ! మీరు చెప్పేదంతా వింటూ వుంటే నాకు మతి పోయినట్లుంది. మా సుధని ఎవరు హత్య చేస్తారు? అందు

వల్ల వాళ్ళకేం లాభం?" బొంగురుపోతున్న గొంతుతో అంది.

"మీరు వెంటనే చెప్పనవసరంలేదు. బాగా ఆలోచించండి. మీ పనిమనుషులుగాని, మీ బంధువుల్లోగాని, ఎవరిమీదనైనా అనుమానం వుంటే నాకు ఫోన్ చేసి చెప్పండి. ఒక హత్య చెయ్యడానికి కేవలం లాభమే వుండనవసరంలేదు. పగతో చెయ్యొచ్చు. అసూయతో చెయ్యొచ్చు. ఎందుకు హత్యచేశారు అనేది మనం ఏమీ చెప్పలేం సావిత్రిగారూ!" అన్నాడు ఇన్స్పెక్టర్ దివాకర్.

సావిత్రి ఏదో ఆలోచిస్తూ తల వూపింది.

"మీ రెండో అమ్మాయి పేరు ఝాన్సీరాణి కదూ?"

అవునన్నట్లు తల వూపింది సావిత్రి.

"ఏ కాలేజీలో చదువుతున్నది?"

"సుజాతారెడ్డి జూనియర్ కాలేజీలో."

"థాంక్స్. అవసరమైతే మళ్ళీ కలుసుకుంటాను" అంటూ వెళ్ళి జీప్‌లో కూర్చుని, "సుజాతరెడ్డి జూనియర్ కాలేజీకి పోనియ్" అన్నాడు.

"ప్రిన్సిపాల్ గారూ! ఝాన్సీరాణి అని సావిత్రిగారి అమ్మాయిని ఒకసారి పిలుస్తారా? కొంచెం పనివుంది" అన్నాడు.

"ష్యూర్! ష్యూర్!...." అని ఝాన్సీరాణిని పిలిపించింది ప్రిన్సిపాల్.

సన్నగా పొడుగ్గా కొంచెం సుధారాణి పోలికలు వున్న అమ్మాయి గదిలోకి ప్రవేశించింది. పదహారు, పదిహేడేళ్ళు వుండవచ్చు ఆమెకు.

ఝాన్సీరాణి గదిలోకి రాగానే ప్రిన్సిపాల్ గది

బైటకు వెళ్ళిపోతుంటే "ఫరవాలేదు కూర్చోండి" అన్నాడు ఇన్స్పెక్టర్.

"మీ అక్కయ్య ఆత్మహత్య చేసుకుందని నువ్వు అనుకుంటున్నావు కదూ!"

ఝాన్సీరాణి తల ఊపింది.

"కాని ఆమె ఆత్మహత్య చేసుకోలేదు. ఎవరో హత్య చేశారు."

ఆమె నమ్మలేనట్లు చూసింది.

"నిజం. కాని హంతకులెవరో చాల తెలివైనవాళ్ళు. పట్టుకోవడం సులభంకాదు. కాని ఒకటి మాత్రం చెప్ప గలను. హత్య చేసింది మీ ఇంట్లోవాళ్ళే, ఐ మీన్ మీతో సన్నిహితంగా తిరుగుతున్నవాళ్ళే."

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చనిపోయిన అక్క జ్ఞాపకం వచ్చి ఏడుపువచ్చింది.

"మీ ఫ్యాక్టరీ మేనేజర్ సీతారామయ్యగారి అబ్బాయి విజయ్ మీ ఇంటికి రోజూ వస్తూ వుంటాడు కదూ?"

తల వూపింది ఆమె.

"ఎందుకొస్తాడు రోజూ?"

"మా తమ్ముడికి, చెల్లికి ట్యూషన్ చెప్తాడు."

"మీ నాన్నగారు చనిపోయి ఎన్నేళ్ళయింది?"

"ఏడేళ్ళు దాటింది."

"అప్పట్నుంచి సీతారామయ్య మేనేజర్‌గా వుంటున్నాడా?"

"అవునండీ."

"విజయ్‌ని పెళ్ళిచేసుకోమని మీ అమ్మ మీ అక్కని బలవంతం చేసేరని తెలిసింది. నిజమేనా?"

"నిజమేనండి."

"మీ అక్కకి విజయ్‌ని చేసుకోవడం ఇష్టంలేదు కదూ?"

"అవునండి."

"ఏం? ఏదైనా కారణం వుందా?"

"మా అక్క వెంకటరమణను పెళ్ళిచేసుకోవాలని అనుకుంది."

"వెంకటరమణ ఎవరు?"

"వైజాగ్‌లో యమ్.బి.బి.యస్. చదువుతున్నాడు."

"అతను మీ అక్కకి ఎలా పరిచయమయ్యాడు?"

"నాకు తెలియదండి."

"మీ అక్కని హత్య చెయ్యడానికి ఎవరికైనా అవకాశం వుందా?"

ఝాన్సీరాణి మాట్లాడలేదు.

"విజయ్ అప్పుడప్పుడూ అంటే తరచుగా మీ ఇంట్లోనే డిన్నర్ చేసేవాడనీ, రాత్రిళ్ళు మీ ఇంట్లోనే నిద్రపోయేవాడనీ తెలిసింది. నిజమేనా?"

"అవునండి. మాతో చాలా చనువుగా వుంటాడు."

"థాంక్స్ ఝాన్సీరాణీ! నీకేదయినా తెలిస్తే నాకు ఫోన్ చేసి చెప్పు."

ఆమె తల వూపింది.

10

"మీరు కరపత్రం ఏ ప్రెస్‌లో అచ్చు వేశారో కనుక్కోమని చెప్పారుగా. రెండు రోజులు ప్రెస్‌లన్నీ తిరిగాను. ఆఖరికి కల్యాణి ప్రెస్‌వాడు ఒప్పుకున్నాడు తనే అచ్చు వేశానని" చెప్పాడు యస్. ఐ. వెంకట్.

"ఎవరు వేయించారట?" అడిగాడు ఇన్‌స్పెక్టర్

దివాకర్.

"ముందు ఎవరో తెలియదన్నాడు. మానవ హక్కుల సంఘం ప్రెసిడెంట్ అన్నాడు. మరి ప్రెస్ పేరు ఎందుకు వెయ్యలేదంటే నీళ్ళు నమిలాడు. నేను బాగా బెదిరించాను. అందులో వేసినవన్నీ తప్పులు. సుధారాణిని యెవరూ రేప్ చెయ్యలేదు. రేప్ చేసినట్లుగా కరపత్రంలో అచ్చు వేయడంవల్ల ఆమె ఆ అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుందనీ, కేసు అచ్చు వేయించినవాడిమీద, వేసినవాడిమీద పెడతామనీ దబాయించేసరికి ఆ ప్రొప్రయిటర్ నీళ్లు కారిపోయాడు. ఆఖరికి చెప్పాడు సీతారామయ్య వేయించాడని" అన్నాడు వెంకట్.

"నేను అనుమానించినట్టే జరిగింది."

"ఏమిటి మీరు సీతారామయ్యను అనుమానిస్తున్నారా?"

"అవును. లేకపోతే ఇంకెవడికి వుంది ఆ దురద?"

"సీతారామయ్యకి యేం లాభం?"

"లాభం వుంది. లాభం లేకుండా యెవడూ ఏ పనీ చెయ్యడు. అది గుర్తుంచుకో. సీతారామయ్య తన కొడుకు విజయ్‌కిచ్చి సుధారాణి పెళ్ళి జరిపించాలని ప్లాన్ వేశాడు. సుధారాణి తల్లి సావిత్రికి కూడా ఇష్టమే! కాని సుధారాణి మాత్రం ఒక మెడికల్ స్టూడెంట్‌ని లవ్ చేసింది. సావిత్రి భర్త పోయిన తర్వాత సుధారాణి ఫ్యాక్టరీని తనే స్వయంగా నడుపుతూవుంది. సీతారామయ్యను తగు దూరంలోనే వుంచింది. ఇక సుధారాణి తన కోడలయితే తప్ప ఫ్యాక్టరీ పూర్తిగా తన అదుపులోకి రాదు. కాని ఆమె తన కొడు

కుని పెళ్ళి చేసుకోవడానికి సుముఖంగా లేదు. ఇక మిగి లింది ఆమె భవిష్యత్తు నాశనం చెయ్యడమే. ఆ పని సీతారామయ్యే చేసి వుంటాడు."

"నిన్న మీరు సావిత్రిని కలుసుకున్నారుగదా! సుధా రాణి పెళ్ళి విషయం మాట్లాడలేదా?" అన్నాడు వెంకట్.

"లేదు."

"ఇప్పుడు ఫోన్ చేసి అడగండి, ఏం చెప్తుందో?"

దివాకర్ ఫోన్ చేశాడు. సావిత్రి రిసీవర్ ఎత్తింది.

"ఇన్‌స్పెక్టర్ దివాకర్ని మాట్లాడుతున్నాను."

"నమస్తే!"

"నమస్తే సావిత్రిగారూ!"

"ఏమిటి ఇన్‌స్పెక్టర్! హత్య చేసింది యెవరో తెలిసిందా?"

"ఇంకా లేదు. మీరు కొంచెం ఓపిక పట్టాలి."

"అలాగే!"

"మిమ్మల్నొక విషయం అడగాలనుకుంటున్నాను."

"అడగండి."

"మీ అమ్మాయి రమణ అనే మెడికల్ కుర్రాడిని ప్రేమించిందనీ, పెళ్ళి చేసుకోవాలనుకుందనీ మాకు తెలి సింది. కాని మీరు ఆ ప్రపోజల్ వ్యతిరేకించారనీ, మీ ఫ్యాక్టరీ మేనేజర్ కొడుకుని చేసుకోమని బలవంత పెట్టారని అనుకుంటున్నారు. మీరు ఏం చెప్తారు?"

"నిజమే ఇన్‌స్పెక్టర్! నేను ఆ పెళ్ళికి వ్యతిరేకించిన మాట నిజమే. కాని విజయ్‌ని పెళ్ళికి చేసుకోమని బల వంత పెట్టలేదు."

"మీరు యేమీ అనుకోకండి. ఆమె ప్రేమించిన

వ్యక్తిని పెళ్ళి చేసుకోవడానికి మీరు యెందుకు వ్యతిరేకించారో తెలియజేస్తారా?"

"ఇందులో పెద్ద కారణం యేమీ లేదు ఇన్స్పెక్టర్ గారూ! రమణ డాక్టర్. అమ్మాయి అతన్ని పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే ఫ్యాక్టరీ ఎవరు చూస్తారు చెప్పండి! అదే మా మేనేజర్ కొడుకుని పెళ్ళి చేసుకుంటే ఇక్కడే వుంటాడు. ఫ్యాక్టరీ మేనేజ్మెంటు గొడవ వుండదు. ఎందుకంటే మా బాబీ యింకా చిన్నవాడు. అందుకే నేను వ్యతిరేకించాను. అంతకంటే పెద్ద కారణం యేమీ లేదు."

"థాంక్స్ సావిత్రిగారూ!" అని రిసీవర్ పెట్టేశాడు.

తనతో ఆమె చెప్పిన విషయాలన్నీ యస్. ఐ. వెంకట్తో చెప్పాడు దివాకర్.

"సార్! మనం ఇంతవరకు ఆ రమణనుగాని, విజయ్ని గాని కలుసుకోలేదు" అని గుర్తు చేశాడు వెంకట్.

"రమణ వైజాగ్లో వున్నాడు. పోతే నువ్వు అతన్ని కలుసుకుని ఏదయినా మనకి పనికివచ్చే సమాచారం వుంటే పట్టుకురా!"

"ఈ హత్య సీతారామయ్య, తన కొడుకు విజయ్తో చేయించి వుంటాడని నాకు గట్టి నమ్మకంగా తోస్తోంది సార్! యెందుకంటే విజయ్ ఎం. ఏ. చదివాడు. వాడి తెలివి తేటలన్నీ వుపయోగించి హత్య చేశాడు. అందుకే మనకు యే క్లూ దొరక్క, తికమకపడిపోతున్నాము" అన్నాడు వెంకట్.

"మన నమ్మకంతో కేసుకు పనేముంది? మన నమ్మకం కోర్టులో పనికిరాదు. విజయ్ మీద, సీతారామయ్య మీద కేసు పెట్టాలంటే బలమయిన సాక్ష్యం కావాలి. అది

దొరికితే తప్ప మనం యెవరిమీదా కేసు పెట్టలేం”
అన్నాడు దివాకర్.

“సరే సార్! నేను రేపే మెయిల్లో వైజాగ్ వెళ్లొస్తాను. మీరీలోపల విజయ్‌ని ప్రశ్నించండి. సీతారామయ్య చర్యలు గమనించమని మఫ్టీలో మన వాళ్ళని పంపండి” అన్నాడు వెంకట్.

ఇన్‌స్పెక్టర్ యేదో ఆలోచిస్తూ తల వూపాడు.

11

పోలీస్ జీప్ సీతారామయ్య ఇంటిముందు ఆగింది.

“నమస్కారం ఇన్స్‌పెక్టర్ గారూ!” అన్నాడు సీతారామయ్య దివాకర్‌ని చూస్తూ.

“మీ ఇంటిని సెర్చి చెయ్యాలి సీతారామయ్యగారూ!” అన్నాడు ఇన్స్‌పెక్టర్.

సీతారామయ్య ముఖం నల్లబడిపోయింది పెనం మీద అట్టులా.

“ఎందుకు?” అన్నాడు తడి ఆరిపోతున్న గొంతులో.

“ఫ్యాక్టరీలో డబ్బు పోయినందుకు?”

“నాకేం సంబంధం?”

“వుంది కాబట్టే.”

“వీల్లేదు. ఫ్యాక్టరీలో డబ్బు ఆ క్యాషియర్ కాజేసి వుండొచ్చు.”

“అందుకు అవకాశం లేదు సీతారామయ్యగారూ! సుధారాణి చనిపోయాక సేఫ్ సీల్ తియ్యలేదు. నిన్నటి వరకూ ఆ సేఫ్‌మీద ఆమె సంతకం చేసిన స్లిప్ అంటించి వుంది. నిన్ననే క్యాషియర్ సావిత్రిగారు, నేను అక్కడ వుండగా సేఫ్ తీశాడు. క్యాష్ బుక్ కీ, సేఫ్‌లో క్యాష్‌కి సంబంధంలేదు. అరవై వేలు తక్కువ వున్నాయి.

ఆమె చనిపోవడానికి ముందురోజు వర్కర్లకి జీతాలు ఇవ్వడానికి డ్రా చేసిన డబ్బులో మిగిలింది సేఫ్‌లో వుంచింది ఆమె."

"ఆ సేఫ్‌లో మాయమైన డబ్బుకి నా బాధ్యత ఏమిటి?"

"వుంది సార్ సీతారామయ్యగారూ! సుధారాణిని హత్యచేసింది మీ కొడుకు విజయ్."

"నో....నో...." గట్టిగా అరిచాడు.

"ష్....ఎందుకలా గొంతు చించుకుంటారు? అందువల్ల మీకేం లాభంలేదు. చూడండి ఇప్పటికే మీ ఇంటిముందు జనం గుమిగూడారు."

"మీరు అన్యాయంగా అభాండాలు వేస్తున్నారు."

"ఇందులో అన్యాయం ఏమీలేదు. సుధారాణి స్వంత తాళాలు కన్పించడంలేదు. అవి మీవాడు తెచ్చి మీకు ఇచ్చివుంటాడు. మీరు సేఫ్ తీసి సుధారాణి సంతకం వున్న స్లిప్ దానిమీద అంటించారు."

"సుధారాణి సంతకం నాకెక్కడ దొరుకుతుంది?"

"మనసుంటే మార్గం వుండదా? ఆమె సంతకాలు ఎన్నో ఫైల్సులో మీ ఆధీనంలో వున్నాయి. ఏదోక ఫైలులో కట్ చేసి అంటించి వుంటారు."

"ఆ పని క్యాషియర్ ఎందుకు చేసి వుండడు?" కోపంతో అరిచాడు సీతారామయ్య.

"క్యాషియర్‌కి బాధ్యత వుంది. అతను ఎటువంటి వాడో మాకు తెలుసు."

"ఇన్స్‌పెక్టర్! నా ఇల్లు సోదాచెయ్యడానికి మీకు అధికారంలేదు."

ఇన్స్‌పెక్టర్ నవ్వి సెర్చి వారెంట్ చూపించాడు.

సీతారామయ్యకి కాళ్ళు చేతులు చల్లబడిపోయాయి.

"మీ అబ్బాయి విజయ్ ఎక్కడ?"

"ఊళ్ళో లేడు."

"ఎక్కడికి వెళ్ళాడు?"

"పనిమీద మద్రాస్ వెళ్ళాడు."

ఇన్స్పెక్టర్ తలవూపి తన సిబ్బంది సహాయంతో ఇల్లంతా సెర్చి వేశాడు. గాద్రెజ్ బీరువాలు రెండు. బట్టల చెక్క బీరువాలు, ట్రంక్ పెట్టెలు అన్నీ పూజ గదిలో సేఫ్ తీయించాడు. అందులో వెయ్యిరూపాయల డబ్బు, కొన్ని నగలు వున్నాయి. అవి సీతారామయ్య భార్యవే. ఆ సేఫ్‌లో నగలు వున్న ఒక అరలో ఒక కవరు దొరికింది.అందులో పన్నెండు ఫోటోలు వున్నాయి.

ఆ ఫోటోలు చూసి షాక్ తిన్నాడు ఇన్స్పెక్టర్ దివాకర్.

సీతారామయ్య తల వంచుకున్నాడు.

'డబ్బు ఎక్కడో దాచివుంటాడు. దొంగసొమ్ము ఇంట్లో వుంచుతాడా?' అనుకున్నాడు ఇన్స్పెక్టర్.

12

ఆ ఫోటోలు చూసి సావిత్రి ముఖం పాలిపోయింది. ఆమె శరీరం చలిజ్వరం వచ్చినట్లు గజగజ వణికిపోయింది. ముఖం రెండు చేతుల్లో కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆ ఫోటోల్లో సావిత్రి నగ్నంగా వుంది.సీతారామయ్య ఆమెతో వివిధ భంగిమల్లో అసభ్యంగా కామక్రీడలు జరుపుతున్న దృశ్యాలు అవన్నీ.

"ఇన్స్పెక్టర్! ఆ ఫోటోలు సీతారామయ్యే తీశాడు మైనూరులోని ఒక హోటల్లో. నా భర్త చనిపోయాక నేను అతనితో సంబంధం పెట్టుకున్నాను. ఒకసారి

దసరాకి మైసూరు వెళ్ళాం. అక్కడ ఒకరోజు హోటల్లో నేను బాగా డ్రింక్ చేశాను. వళ్ళు మరిచిపోయి ప్రవర్తించాను. సీతారామయ్య అవన్నీ ఫోటోలు తీసి అప్పట్నుంచి నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. చీటికి మాటికి డబ్బు గుంజుతున్నాడు."

"ఇన్నాళ్ళూ ఈ సంగతి మాకు చెప్పచ్చుగా!"

"పరువుపోతుందని భయపడ్డాను. ఇన్స్పెక్టర్ ప్లీజ్! ఈ ఫోటోలు బైట పెట్టకండి. నా పరువుప్రతిష్ఠ మంట గలపకండి. వాటికి భయపడే నేను సీతారామయ్య చేతిలో కీలుబొమ్మగా ఆడాను. అడిగినంత డబ్బు ఇచ్చాను. ఇన్స్పెక్టర్ నేను నా నేరం ఒప్పుకుంటున్నాను. ఫ్లాస్కులో విషంపోసి వుంచింది నేనే. ఆ తర్వాత పని మనిషి అందులో పాలుపోసేది. విజయ్‌ని పెళ్ళిచేసుకోవడానికి సుధ ఒప్పుకోక పోవడమే ఈ హత్యకి కారణం. సుధ నా కన్నకూతురు కాదు. నాలుగేళ్ళ వయసులో తల్లి పోయింది. నేను ఆయన రెండో భార్యను. సుధ, విజయ్‌ను చేసుకుంటే నాకు శాశ్వతంగా సీతారామయ్య బ్లాక్ మెయిల్ తప్పేది. కాని, సుధ రమణను పెళ్ళిచేసుకుంటానని పట్టుపట్టింది. అలాచేస్తే నేను, నా బిడ్డలు అన్యాయమైపోతామని యీ హత్యకు తలపడ్డాను" ఏడ్వసాగింది సావిత్రి.

"మరి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆ లెటర్ రాసిందెవరు?"

"నేనే!" సావిత్రి యేడుస్తూ ఒప్పుకుంది తన నేరం.

—: ఐపోయింది :—